తొలగిస్తే పోలా..!

- రోడ్డుకు ఇరువైపులా ప్రమాదభరితంగా ఎండిన చెట్లు
- ఈదురుగాలులకు ఊగుతున్న వైనం


దంగేరు-పేకేరు రహదారిలో ఎండిపోయిన చెట్లు

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామాలకు వెళ్లే రహదారిలో రోడ్లకు ఇరువైపులా ఎండిపోయిన చెట్లు ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం శీతాకాలం పూర్తవడంతో ఎండల తీవ్రత పెరుగుతుంది. వేసవిలో వాతావరణ పరిస్థితులు అనూహ్యంగా ఉంటాయి. ఎప్పుడు ఈదురుగాలులు, వర్షం పడుతుందో తెలియని పరిస్థితి. అటువంటి సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎండిన చెట్లు ఈదురుగాలులకు రోడ్డు మీద పడి ఏ ప్రమాదానికి దారి తీస్తుందోనని ప్రయాణికులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో పామర్రు-కె.గంగవరం, కుడుపూరు-పేకేరు, శివల-యర్రపోతవరం, దంగేరు-కుడుపూరు, కాజులూరు మండలంలోని కుయ్యేరు-కాజులూరు, గొల్లపాలెం-ద్రాక్షారామ, పలు గ్రామాలకు వెళ్లే రహదారులు, రామచంద్రపురం మండలంలో పామర్రు-రామచంద్రపురం, తాడిగొయ్య- వెంకటాయపాలెం, హసన్‌బాద-వ్రపూడి, పామర్రు నుంచి మండపేట, అంగర నుంచి కపిలేశ్వరపురం వంటి గ్రామాలకు వేళ్ల రహదారుల్లో ఎండిపోయిన చెట్లు, తాడిచెట్లు, కొబ్బరి చెట్లు కోకొల్లలుగా ఉన్నాయి. రైతులు, వ్యాపారులు, విద్యార్థులతో ఈ రహదారులు ఎప్పుడు రద్దీగా ఉంటాయి. ద్విచక్ర వాహనదారులు, వాహనాలు, కాలినడకన ఎక్కువ వెళ్లేవారుంటారు. ఈ తరుణంలో ఈ ఎండిన చెట్లను తొలగించకపోతే అధికారులు భారీ మూల్యం చెల్లించక తప్పదు. ఇప్పటికైనా ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఎండిన చెట్లను తొలగించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండిన చెట్లను తొలగించాలి

కుడుపూరు-దంగేరు రహదారిలో ఎండిన చెట్లు ఎక్కువగా ఉన్నాయి. ప్రతి రోజు ఈ రహదారి మోటారుసైకిళ్లు, కార్లు, సైకిళ్ల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఎప్పుడు ఏ చెట్టు విరిగిపడుతుందో తెలియని పరిస్థితి. వెంటనే ఎండిన చెట్లను తొలగించాలి.

– కడలి ఉమామహేశ్వరరావు, పేకేరు

ప్రమాదాలను అరికట్టాలి

గతంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికుల మీద కొబ్బరి ఆకులు, ఎండిపోయిన చెట్టు కొమ్మలు పడి గాయపడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రమాదం జరిగిన తరువాత బాధపడడం కంటే ముందే మేల్కొంటే మంచిది. అధికారులు స్పందించి ఎండిన చెట్లు తొలగించే ఏర్పాట్లు చేయాలి.

– ఎం.రాంబాబు, యర్రపోతవరం

డ్రెయినేజీ దర్జాగా మూసేశారు

మురుగునీరు పోయే మార్గం లేక స్థానికుల గగ్గోలు


సిమెంటుతో మూసేసిన డ్రెయిన్

మండపేట: ఓ పక్క పురపాలక సంఘంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ మండపేట అంటూ వీధివీధినా పర్యటనలు చేస్తూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి, డ్రెయినేజీల్లో చెత్తా చెదారాలు వేస్తే కుదరదని, లెక్క చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రచారంలో దూసుకుపోతున్న మున్సిపల్ అధికారులకు ఏకంగా డ్రెయినేజీనే సిమెంటుతో కప్పేసి అక్కడ డ్రెయిన్ వుందా అన్నట్టు చిత్రీకరించిన సన్నివేశాలు అధికారులకు కనిపించడం లేదు. వివరాల్లోకి వెళితే మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు న్యూకాలనీలోని రెండో వీధిలో ఓ భవన యజమాని తన ఇంటి ముందు నుంచి మురుగునీరు వెళ్లడం ఇష్టం లేక ఆ ఇంటి పొడవునా వ్యాపించి వున్న మున్సిపల్ డ్రెయిన్‌ను సిమెంటు నిర్మాణం చేసి పూర్తిగా మూసేశారు. ఈ చర్య వెనకాల స్థానికంగా వున్న ఓ టీడీపీ నాయకుడు వెన్నుదన్నుగా నిలిచి అక్రమంగా డ్రెయిన్‌ను మూయించారు. సదరు టీడీపీ నాయకుడి భార్య వార్డు ప్రజలందరి ఆశీస్సులతో కౌన్సిలర్‌గా గెలిచి వార్డులో వుండే సమస్యలు పరిష్కరించాల్సింది పోయి సమస్యను సృష్టిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. టీడీపీ నాయకుడి అండదండలతో ఏం చేసుకుంటారో చేసుకోండి నా ఇంటి ముందున్న డ్రెయిన్‌ను ఎవరు తెరిపిస్తారో నేనూ చూస్తానంటూ సవాల్ చేయడంతో ఆ చుట్టుపక్కల వుండే స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు కూడా అతడి మాటలకు భయపడి అసలు డ్రెయిన్ జోలికి పోవడం లేదని వాపోయారు. సచివాలయానికి అతి దగ్గరలో ఉత్పన్నమైన చిన్న సమస్యను అధికారులు పరిష్కరించలేకపోవడంతో ప్రజలు ఆశ్చర్యచకితులవుతున్నారు.

రేపు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

మండపేట: రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండల శాఖ నెలవారీ సమావేశం శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వీధిలోని బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న శ్రీరామ హిందూ మున్సిపల్ యూపీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి పెంకే గోవిందరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమావేశం మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీరామ హిందూ పాఠశాలలో ప్రారంభమవుతుందని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగే సమావేశానికి విశ్రాంత ఉద్యోగులంతా తప్పని సరిగా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సర్వీస్ పెన్షనర్స్ ప్రొఫైల్, వివిధ సర్టిఫికెట్లు, ఇన్‌కంట్యాక్స్, పెన్షనర్స్ సమస్యలపైనా చర్చించి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

దంతాల సంరక్షణ అవసరం


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న క్రాంతి కుమార్

కె.గంగవరం: సమాజంలో అందరూ దంతాల సంరక్షణపై అవగాహన కలిగించుకోవాలని దంత వైద్యుడు క్రాంతికుమార్ అన్నారు. మండలంలోని కె.గంగవరం ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దంత పరిశుభ్రత, దంతాల పరిరక్షణ, దంతాల అవసరంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం 80 మంది విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కె.రమేష్, కేవీ శ్రీనివాస్, పీవీ బ్రహ్మానందం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మండపేట: ఈ నెల 8 శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన ప్రకటనలో మాట్లాడుతూ స్థానిక మండలప్రజా పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీపీ అధ్యక్షుడు వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఎంపీడీవో కె.సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు సమావేశానికి హాజరు కావాలని ప్రజాప్రతినిధులకు ఆహ్వానం పంపినట్టు తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు హాజరుకావాలని ఎంపీడీవో సూచించినట్టు తెలిపారు.

ఐఐటీకి ప్రణీత ఎంపిక


ప్రణీత

మండపేట: జిల్లాలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో పరిశోధన అనుభవాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన తిరుపతి ఐఐఎస్ఈఆర్ విద్యా విజ్ఞాన రీసెర్చ్‌కు పట్టణంలో గౌతమి మున్సిపల్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుకుంటున్న వై.ప్రణీత ఎంపికయ్యారని పాఠశాల ఉపాధ్యాయుడు రామచంద్రారెడ్డి తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డిలు ప్రణీతకు అభినందనలు తెలిపారు.

శాంతి భద్రతలపై అవగాహన పెంచుకోవాలి


అంగర పోలీస్ స్టేషన్‌లో వైర్‌లెస్ సెట్‌లో విద్యార్థినితో మాట్లాడిస్తున్న ఎస్సై

కపిలేశ్వరపురం: శాంతి భద్రతల కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని అంగర ఎస్సై డి.రవికుమార్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అంగర పోలీస్‌స్టేషన్‌లో గురువారం ప్రయోగాత్మక అవగాహన కల్పించారు. సమస్యలపై ఫిర్యాదు అందజేసే తీరు, పోలీస్ సిబ్బంది స్పందించడమూ, నేరాలపై నమోదు చేసే సెక్షన్లు క్రైమ్ చార్జు, రైటర్ విధులు తదితర అంశాలపై ఎస్సై విద్యార్థులకు వివరించారు. వైర్‌లెస్ సెట్‌ను వాడే విధానంపై ప్రయోగాత్మకంగా విద్యార్థులతో మాట్లాడించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో ఓపెన్ హౌస్

రామచంద్రపురం రూరల్: మహిళా దినోత్సవం పురస్కరించుకుని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థినులకు గురువారం ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రపురం సీఐ ఎం.వెంకట నారాయణ, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్‌లు పోలీసుల విధులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అదే విధంగా వాకీ టాకీ పనిచేసే విధానం వివరించారు. వారు మాట్లాడుతూ పోలీసులకు ప్రజలకు మిత్రులని, వారి కోసమే 24 గంటలూ పనిచేస్తున్నారని తెలిపారు. ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు పోలీస్ స్టేషన్‌కి రావడానికి బయపడకూడదని సూచించారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

మండపేట: పురపాలక సంఘంలో ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి నెలాఖరు లోగా పట్టణంలో కట్టాల్సిన వివిధ రకాల పన్నులను వసూలు చేసి నూరు శాతం లక్ష్యాన్ని సాధిస్తామని ఆయన అన్నారు. మున్సిపల్ పరిధిలోని 30 వార్డుల్లోను ఇంటి పన్నులు, కుళాయి, ఖాళీస్థలాల ద్వారా వచ్చే పన్నులు ఈ ఏడాది మొత్తంగా రూ.8.76 కోట్లు ఆదాయం రావాలన్నారు. ఇప్పటిదాకా వసూళ్లు గురువారం నాటికి రూ.5.20 కోట్లు వచ్చిందన్నారు. ఇంకా రూ.3.56 కోట్లు వసూలు కావాల్సి వుందన్నారు. వసూళ్ల కోసం మున్సిపల్ అధికారు ల పర్యవేక్షణలో సచివాలయం, కార్యాలయంలోని ఇతర శాఖల సిబ్బందిని బృందాలుగా విడదీసి వసూళ్లపై దృష్టి కేంద్రీకరించామని తెలిపారు.

'సంపద' కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్‌డీ తదితరులు

కె.గంగవరం: గ్రామాల్లో ఉన్నత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సరై పద్ధతిలో సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఈఓపీఆర్‌డీ గౌరికుమారి, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ లావణ్య అన్నారు. మండలంలోని దంగేరులో పంచాయతీ కార్యదర్శులకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు పూర్తి స్థాయిలో చెత్త అందించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గతంలో ప్రతి ఇంటికీ వచ్చిన తడి, పొడి చెత్త డస్ట్‌బిన్లను సద్వినియోగం చేసుకుని చెత్తను వేరు వేరుగా సేకరించాలని కోరారు. ఈ చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి చెత్తను ఎరువుగా మార్చవచ్చన్నారు. తొలుత గ్రామంలో పారిశుద్ధ్యంపై గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రీన్ అంబాసిడర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ రావిపాటి వెంకట గణేష్ చౌదరి, దంగేటి నాగేశ్వరరావు, మేడశెట్టి పుణ్యమూర్తి, నల్లా రాంబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థి దశలో పదో తరగతి కీలకం


విద్యార్థులకు పరీక్ష సామగ్రి కిట్లను అందిస్తున్న ఎస్సై జానీ బాషా, క్రాంతికుమార్

కె.గంగవరం: ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశకు సంబంధించి పదో తరగతి చాలా కీలకమని కె.గంగవరం ఎస్సై జానీబాషా అన్నారు. మండలంలోని కె.గంగవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు దంత వైద్యుడు క్రాంతికుమార్ సమకూర్చిన పరీక్ష సామగ్రి కిట్లను గురువారం ఆయన విద్యార్థులకు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తగిన ప్రోత్సాహం ఉంటే విద్యలో బాగా రాణించగలుగుతారన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో విద్యార్థులకు ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. డీవైఈఓ పి.రామలక్ష్మణమూర్తి, ఎంఈఓ నాగరాజు, హెచ్ఎం వెంకటేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి


మహిళా సదస్సునుద్దేశించి మాట్లాడుతున్న ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయ

కె.గంగవరం: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు కూటమి ప్రభుత్వాలు ప్రజలకు ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను తక్షణం అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.విజయ డిమాండ్ చేశారు. పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో గురువారం కె.గంగవరం మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం పురస్కరించుకుని మహిళా సదస్సు నిర్వహించారు. విజయ మాట్లాడుతూ ఆకాశంలో దేశ జనాభాలో సగం కంటే ఎక్కువ ఉన్న మహిళలను ఆకాశంలో సగం అంటూ ఆకాశానికి ఎత్తేయడం తప్ప ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో న్యాయం చేయడం లేదని మండి పడ్డారు. మహిళలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకోవడంలో భాగంగా బూటకపు వాగ్దానాలు ఇచ్చి మోసం చేస్తున్నారని అన్నారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ ఆమోదం జరిగినా 2030 వరకు అమలు చేయకపోవడం స్త్రీల పట్ల పాలకులకు ఉన్న చిత్తశుద్ధి ఏపాటితో అర్థమవుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో మహిళలకు మొండి చేయి చూపారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చి మహిళల ఉసురు తీస్తున్నారన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, ప్రతినెలా మహిళలకు రూ. 1500 నగదు పంపిణీ తదితర ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు వి.శాంతి, సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వర్లు, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, చింతా రాజారెడ్డి తదితరులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


ధ్వజారోహణలో పాల్గొన్న భక్తులు

మండపేట: జిల్లాలోనే ఆధ్యాత్మిక గ్రామంగా విరాజిల్లుతున్న మండలంలోని అర్తమూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. భక్తమండలి చైర్మన్ సత్తి బులిస్వామి రెడ్డి, ప్రముఖులు సత్తి సుబ్బారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వైభవంగా జరిగాయి. పరిసర గ్రామాల నుంచి వందలాది భక్తులు అర్తమూరు వచ్చి స్వామి సేవలో తరించారు. ముగింపు ఉత్సవాల సందర్భంగా నిత్యపూజలు, మూలమంత్ర సహిత శాంతి హోమం నిర్వహించారు. వెదురుపాక విజయదుర్గా పీఠం కన్వీనర్ వీవీ బాపిరాజు చేతుల మీదుగా పూర్ణాహుతి నిర్వహించారు. ముగింపు సూచకంగా ధ్వజారోహణ నిర్వహించారు. గోవింద మాలధారులు, భక్తుల కోలాహలం నడుమ స్వామి వారిని పవిత్ర తుల్యభాగ నదీతీరంలో చక్రస్నానం చేయించారు. ద్వాదశారాధనతో పాటు శ్రీవారి పల్లకీ సేవ, శ్రీపుష్పయాగం, పవళింపు సేవలతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. అర్చక స్వాములు కాండూరి వెంకటరమణాచార్యులు, ఇతర వేదపండితులను భక్తమండలి కమిటీ ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఉద్దగిరి ఆంజనేయులు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 9 నుంచి 16 వరకూ నిర్వహించనున్నట్టు అర్చకులు పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యలు, ప్రసన్నకుమార్ భార్గవ్, సంపర లక్ష్మీనరసింహ భాస్కర శ్రీనివాసాచార్యులు తెలిపారు. 9న స్వామికి పంచామృతాభిషేకం, పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలని చేయడం, 10న నిత్యహోమం, నీరాజన మంత్రపుష్పం, స్వామి ఆలయం నుంచి పోలేరమ్మ ఆలయం వరకూ రథోత్సవం, కల్యాణం, 11న విశేషార్చన, 12న సదస్యం, పండితాశీర్వచనం, 13న అర్చకుడు సంపర వేణుగోపాల సింగుబాబుతో చోర సంవాద కథాశ్రవణం, 14న వాహనాల ఊరేగింపు, 15న శ్రీపుష్పయాగం 16న ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు.

జగన్‌ను కలసిన నాయకులు


మాజీ సీఎం జగన్‌తో రామచంద్రపురం నాయకులు, ఎంపీ బోస్, కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రామచంద్రపురం నాయకులు ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌లతో కలసి గురువారం కలిశారు. రామచంద్రపురం మండల ఎంపీపీ అంబటి భవాని, నెహ్రూ దంపతులు, ఇటీవల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన, వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్‌లు పార్టీ అధినేతను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వారితో ఆప్యాయంగా మాట్లాడి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ


వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ, సిద్ధయ్య విగ్రహాల త్రయాహ్నిక ప్రతిష్ఠా ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అశిరాంబ అమ్మవారి ఆలయ సమీపాన శిథిల మందిరాన్ని తొలగించి నూతనంగా నిర్మించారు. ఉగాది పురస్కార గ్రహీత తాళాభక్తుల వీరభద్రాచార్యులు, అత్తిలి రామకృష్ణ ఆధ్వర్యంలో పుణ్య భక్త దంపతులతో ప్రతిష్ఠ పూజలు చేయించారు. మందిరం వద్ద అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రతిష్ఠ పూజలకు సహకరించిన భక్తులకు నిర్వాహకుడు గొల్లి వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులు, వితంతువులకు దుస్తుల పంపిణీ


మహిళలకు కుట్టుమెషీన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

రాయవరం: స్థానిక క్రీస్తు సంఘం లవ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30 మంది వృద్ధులకు, వితంతువులకు, నూతన వస్త్రాలు అందజేశారు. డోర్కా టైలరింగ్ మొదటి శిక్షణ క్లాసుల్లో శిక్షణ పూర్తి చేసిన 12 మంది మహిళలకు సర్టిఫికెట్లు ఇచ్చారు. ఉచిత టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టుమెషన్లు కూడా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. అంతేకాకుండా భర్త చనిపోయిన వితంతువులకు చంద్రమళ్ల విజయకుమార్ భార్య వినీల, వారి ఇద్దరు పిల్లలకు రూ.పది వేల నగదు, నిత్యావసరాలను ఇచ్చారు. తొస్సిపూడికి చెందిన వైరాల సత్యశ్రీ, ఉప్పు వెంకాయమ్మ, సోమేశ్వరానికి చెందిన మరో మహిళకు రూ.5 వేల చొప్పున ఇచ్చారు. అలాగే నూతన దుస్తులు, నిత్యావసరాలు అందజేశారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ టి.నతానియేలు, టి.కిషోర్ కుమార్, టి పి రత్నం, రాయవరం సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, మందపల్లి కొండలరావు, టైలరింగ్ టీచర్ ఎం.వరలక్ష్మి, శ్రీమంతుల మనీషు, చంద్రమళ్ళ రాము, మహిళలు క్రీస్తు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కామేశ్వరశర్మ కన్నుమూత


మృతుడు కామేశ్వరశర్మ (ఫైల్)

మండపేట: పట్టణానికి చెందిన అయినవిల్లి కామేశ్వరశర్మ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన గురువారం అకస్మాత్తుగా మరణించారు. ఈయనకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు వున్నారు. శ్రీజనార్దన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఈయన ప్రధాన అర్చకులుగా వ్యవహరించేవారు. హిందూ ధర్మ పరిరక్షణకు ఈయన ఎనలేని కృషి చేశారు. ఈయన మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రెడ్డి రాధాకృష్ణ, చుండ్రు శ్రీవరప్రకాష్ తదితరులు తమ సంతాపాన్ని ప్రకటించారు.

చర్చి నిర్మాణం నిలుపు చేయాలంటూ నిరసన

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ ఒకటో వార్డులో స్థానికంగా ఉంటున్న హిందువుల మనోభావాలు దెబ్బతినేలా చర్చి నిర్మిస్తున్నారని దానిని నిలుపుదల చేయాలని కోరుతూ గురువారం రాత్రి నిరసన తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్మాణం చేపట్టారని దీనిపై స్థానికంగా నివసిస్తున్న వారు ద్రాక్షారామ పంచాయతీకి ఫిర్యాదు చేశామన్నారు. అయితే పంచాయతీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని సైతం తొలగించారని, నిరసన తెలపడానికి వెళ్లిన తమపై అక్కడ ఉన్న వ్యక్తులు తమపై దౌర్జన్యం చేశారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రణాళికాబద్ధంగా 'పది' ఏర్పాట్లు


అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ

కపిలేశ్వరపురం: ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంఈఓ కె.తాతారావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై గురువారం మండలంలోని కపిలేశ్వరపురం, అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్దేశించిన పరీక్ష గదులను పరిశీలించారు. అనంతరం విలేకరులకు పరీక్షల ఏర్పాట్లు, పరీక్ష రాసే విద్యార్థుల వివరాలు వెల్లడించారు. కపిలేశ్వరపురం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 231 మంది బాలురు, 239 మంది బాలికలు మొత్తం 470 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వారిలో 8 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 180 మంది బాలురు, 195 మంది బాలికలు మొత్తం 375 మంది, 3 ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి 51 మంది బాలురు, 44 మంది బాలికలు మొత్తం 95 మంది పరీక్షలు రాయనున్నారు. కపిలేశ్వరపురం, మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 63 మంది బాలురు, 70 మంది బాలికలు మొత్తం 133 మంది కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో పరీక్షలు రాయనున్నారు. వల్లూరు, కాలేరు, నల్లూరు, అంగర, టేకి జెడ్పీ ఉన్నత పాఠశాలలు, మూడు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 160 బాలురు, 155 మంది బాలికలు మొత్తం 315 మంది విద్యార్థులు అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎ, బి అనే రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది బాలురు, 14 మంది బాలికలు మొత్తం 22 మంది కె.గంగవరం మండలం పామర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్టు ఎంఈఓ తాతారావు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మండపేట: మండలంలోని ఏడిదలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రత్నాలరావు మీడియాకు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిచిపోతుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఏడిద చుట్టుపక్కల గ్రామాల్లో చెట్లకొమ్మల తొలగింపు, వివిధ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'కొనగళ్ల'కు పరామర్శ


సూర్యప్రభ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

మండపేట: ఇటీవల తన భార్యను కోల్పోయి బాధల్లో వున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కొనగళ్ల భాస్కరరావును ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, వైఎస్సార్ సీపీ నేతలు వేగుళ్ల పట్టాభిరామ్య చౌదరి, మాధవి ఎడిబుల్ ఆయిల్ అధినేత వేగుళ్ల మాధవిబాబులు పరామర్శించారు. గురువారం చిన్న గొల్లపుంతలో వుంటున్న ఆయన నివాసానికి వెళ్లి సూర్యప్రభ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. మృతురాలి పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించి, తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. పరామర్శలో బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, ఆ పార్టీ ఐటీ విభాగం అధ్యక్షుడు యరమాటి వెంకన్నబాబు ఉన్నారు.

వసతులు మెరుగుపరచాలి

కాజులూరు: మండలంలోని తణుకువాడ శివారు దొరగారిపాలెంలో వసతులు మెరుగు పరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గురువారం గ్రామాల్లోమాజీ పంచాయతీ పాలకవర్గ సభ్యుడు డొప్పా బాలకృష్ణ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీల ఏర్పాటు, మంచినీటి సరఫరా, రహదారుల సదుపాయం లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. శలపాక, మంజేరు రహదారి నుంచి గ్రామంలోకి వచ్చేందుకు కోరంగి కెనాల్‌పై నిర్మించిన కాలిబాట వంతెనకు ఇరువైపులా అప్రోచ్ నిర్మించకపోవటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అప్రోచ్‌కు స్థానికులు ఏర్పాటు చేసుకున్న మట్టి జారిపోయి తరచూ వాహనాలు వంతెనపై నుంచి కాలువలోకి పడిపోతున్నాయన్నారు. అధికారులు స్పందించి ఈ శివారు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.